

అతనికేం చేయాలో పాలుపోవడంలేదు. బయట చలిగాలి. వెన్నెలవాన. గదిలోపల అగరువత్తుల ధూపం. మల్లెపూల సొన్ను సౌరభం. టీపాయ్‌మీద పండ్లు ఫలహారాలతో స్వీటు పళ్ళాలు. తెల్లని దుస్తులతో అతను. అంతకన్నా తెల్లనైన ఉడుపులలో మంచులో చెక్కిన బొమ్మలా నించుందామె గది గుమ్మందగ్గర. ఆమె అందాన్ని తనవితీర ఆస్వాదిస్తున్నాడు నరహరి, 'స్వీట్ సిక్స్టీన్...పదహారు సంవత్సరాల పసిడిబొమ్మ' అని నోరు చప్పరిస్తున్నాడతను.

ఆ రాకుమారి క్రీగంటి చూపులు కొరడాదెబ్బల్లా తగిలాయి నరహరికి. అతనికి ధైర్యం వచ్చింది. పురుషత్వం విజృంభించింది. ఆమెని మెల్లగా సమీపించాడు.

'అక్కయ్యా...అక్కయ్యా... తలుపు... తలుపు...' తలుపు తట్టిన చప్పుడు. ఒకసారి సిగ్గుతో నరహరివంక చూసి తలుపులు తీసింది రాకుమారి.

తలుపులు తీయగానే ఇరవై సంవత్స

లాం క్రాఫ్టు చేతిలో సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టెతో ప్రత్యక్షమయ్యాడు.

'అక్కయ్యా...అక్కయ్యా... బావగారు వొచ్చారుట' అంటూ తడబడుతూ తనకి అందుబాటులోవున్న టేబిల్ మీద అవన్నీ గబగబా బయటికి వెళ్ళిపోయాడు.

'వెధవా...పెంకితేషాలూ నువ్వునూ...' అంటూ మాటల్ని సాగతీస్తూ తలుపులు వేసిందో పెద్ద ముత్తైదువ. నరహరి గుండెలపై ఎవరో బలంగా కొట్టినట్లయింది. అతను అనాలోచితంగా అడిగాడు' ఎవర్రా అబ్బాయి.'

'మా తమ్ముడు—' అందామె విశ్లేషణంగా.

'అంటే' నసుగుతున్నాడతను.

'మా రెండో తమ్ముడు బి.కాం. ఫైనలియర్ చదువుతున్నాడు' అందామె కళ్ళెత్తి అతనివంక చూస్తూ.

నరహరి నోట్లో వచ్చి వెలక్కాయ పడింది.

'అంటే అతని వయసు...వయసు...' అతని మనసులో మాట బయట పడింది. ఆమె చికాకుగా కళ్ళు చిట్లించి చూసింది. అతని శరీరంలో రక్తప్రవాహం ఒక్కర క్షణం ఆగిపోయింది. గబ గబా పెరటి తలుపులు తీసి వెన్నెల వానలో తడవలేక మల్లె పందిరి నీడలో నించున్నాడు. కాని అక్కడ వుండలేకపోయాడు తిరిగి గదిలోకి వచ్చి ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

'నీ వయస్సెంత?'

'మా తమ్ముడికి ఇరవై నిండలేదు—' అందామె చురుగ్గా.

'దెన్‌యు ఆర్‌నాట్ సిక్స్‌టీన్. నాట్ సిక్స్‌టీన్...' అతని మొహంపై రంగులు మారాయి.

సిగరెట్ వెలిగించాడు. 'సుబ్బరామయ్యా...పెళ్ళిళ్ళ పేరయ్యా...డామ్ డర్టీ గూస్...నిన్ను చంపినా పాపం లేదు—' అంటూ మనసులో కసితీరా తిట్టుకున్నాడు నరహరి.

* * *

'అయ్యా...ఏదో పెద్దవాణ్ణి. మరీ అంతంత పెద్దపదాలు వాడకండి...వాటి అర్థంకూడా నాకు తెలీదు' అన్నాడు సుబ్బరామయ్య అమాయకంగా మొహం పెట్టి.

'మిస్టర్ సుబ్బరామయ్యా ... నీకో దణ్ణం. నీ సంబంధాలకో దణ్ణం. నన్ను విడిచిపెట్టు బాబూ...' అన్నాడు నరహరి బ్రతిమాలే ధోరణిలో.

'మీరిలా తొందర పడకూడదు. ఈ సంబంధం వుంది చూశారూ—?' ఆయన మాటలకి అడ్డువస్తూ అన్నాడు నరహరి, 'మొన్న గజలక్ష్మి సంబంధం విషయంలో కూడా ఇలాగే ప్రారంభించారు'

'మీరు నమ్మరుగాని ఆ గజలక్ష్మికి పదిహేను నిండలేదని ఆవూరి మునసబు, కరణం, సర్పంచ్, చెప్పారు. పైగా అనుమానం వుంటే వంద రూపాయిల స్టాంపు కాగితాలు పుచ్చుకోండి. రాసిస్తామన్నారు' అన్నాడు సుబ్బరామయ్య కండువా సర్దుకుంటూ.

'ఇదిగో ఆ పిచ్చికూతల రికార్డు మళ్ళీ వేయవద్దంటున్నాను. మేం జనన మరణ రిజిష్ట్రారువారి కార్యాలయంలో పది రూపాయిలు తగలేసి కనుక్కున్నాం. ఆ పిల్లకి ఇరవై ఆరు దాటింది.'

'అయిందేదో అయింది. ఈ సంబంధంవుంది చూశారూ రోజాలాంటిది. అమ్మాయిపేరు రాకుమారి. పేరుకు తగ్గట్టు వుంటుంది'

నరహరి గదిగోడకి తగిలించిన 'సిరీ క్వీన్' కాలండర్‌వంక చూస్తున్నాడు.

'మెట్రిక్‌లేషన్ పరీక్షకి చదువుతున్నది.'

'అంటే పదహారు సంవత్సరాలంటావు. మై డియర్ సుబ్బరామయ్య. మెట్రిక్‌లేషన్ చదివేవాళ్ళందరి వయసు పదహారు సంవత్సరాలుండవు.'

'అనకూడదుగాని మీరిప్పుడు చూస్తున్న 'సిరీక్వీన్'. 'శ్రీమతి' గత అయిదు సంవత్సరాల నుండి తన వయసు పదిహేను నిండాయని ప్రతిపత్రికా విలేఖరితో చెబుతున్నది.'

'అసలు విషయాన్ని దాటేస్తున్నారు.'

'పిల్ల చక్కనిది. పదహారు సంవత్సరాల పసిడిబొమ్మలా వుంటుంది' స్వీట్స్ చప్పరిస్తున్నట్లు చెప్పసాగాడు.

'వుంటుంది అంటున్నారు. మీరు చూడలేదా?'

'బంగారు బొమ్మలా వుంటుందని అర్థం' అని ఒకసారి గొంతు సవరించుకుని 'మీరు ఒకసారి చూస్తే' అంటూ సులోచనాల్లోంచి నరహరిని పరిశీలించసాగాడు సుబ్బరామయ్య.

నరహరి ఆలోచిస్తున్నాడు. ఆ పదహారు సంవత్సరాల పసిడిబొమ్మనుగురించి.

* * *

ఆ బంగారుబొమ్మ అనంతరామయ్యగారి ప్రథమపుత్రిక పేరు రాజకుమారి. ఎం. ఏ. వరకు చదువుకుంది. ప్రభుత్వ మహిళా కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం చేస్తున్నది.

అనంత రామయ్యగారికి ఆరుగురు సంతానం. అందులో మొదటి నలుగురు ఆడపిల్లలు. తరువాత ఇద్దరు మొగపిల్లలు. ఆయన స్వతహా ఆశావాది. పైగా విశాల దృక్పథంగల మనిషి. అమ్మాయిలకి పెద్ద పెద్ద చదువులు చెప్పించి ఉన్నతస్థాయిలో వున్న వుద్యోగులకిచ్చి వివాహం చేయాలనుకున్నారు. కాని ఆయన రెండో కోరిక నెరవేరలేదు.

నేటి యువలోకం చైతన్యవంతమయింది. సమాజం మారుతున్నదని పుస్తకాలలో వాక్యాలు వల్లెవేసేవారు కనబడ్డారు గాని, కట్నంలేకుండా వివాహం చేసుకుంటామని ముందుకి వచ్చేవారు ఆయనకంట పడలేదు. ప్రాథమిక పాఠశాలలో మకుటంలేని మహారాజులా ఉపాధ్యాయ వృత్తిలోవున్న అనంత రామయ్యగారికి, పూర్వులిచ్చిన ఆస్తి ఇరవైవేలు ఖరీదుచేసే భూములు. పెండ్లికొడుకుల్ని వేటాడంలో విసిగి వేసారిన అనంత రామయ్యగారు చివరికి ఒక డాక్టరు సంబంధం పదివేల కట్నంలో ఖాయంచేశారు. కాని రాకుమారి ఆ సంబంధం పట్ల తన మక్కువ వ్యక్తపరచలేదు. 'నా చదువుకోసం ఆరువేలు ఖర్చుపెట్టారు మళ్ళీ పెండ్లికోసం పదిహేనువేలు ఖర్చుపడితే, నా తరువాత వాళ్ళకి మిగిలే దేమిటని—' తర్కించి నిలదీసింది.

'నన్ను ఎవరైన కట్నంలేకుండా పెండ్లి చేసుకుంటానంటే చేసుకుంటానని —' మొండిపట్టు పట్టింది

రాకుమారి:

* * *

'నీ కంత మంకు పట్టుదల తగదురా'

'లేదు నాన్నా ...పిల్ల నాకు నచ్చాలి. అప్పుడే పెండ్లి. వాళ్ళు కట్నం యివ్వక పోయినా సరే.

'అయితే నీకీ జన్మలో పెండ్లికాదు' అంటూ విసుక్కున్నారు లక్ష్మీపతిగారు.

'ఫరవాలేదు—' అన్నాడు నిర్లిప్తంగా నరహరి.

'అదికాదురా' అంటూ హితబోధ చేయబోయిన తండ్రిమాటల్ని లక్ష్యపెట్టకుండా బయటికి వెళ్ళిపోయాడు నరహరి.

కొడుకు పెండ్లితో తన ఆస్తిని రెండింతలు చేయదలిచిన లక్ష్మీపతిగారి ఏకైక పుత్రుడు నరహరి. అతి గారాబంగా పెరిగిన నరహరి ఎస్ ఎస్ ఎల్.సిని దాటలేక అచ్చిరాలేదని మెట్రిక్ అయిపోయిందనిపించి, పి. యు. సి.లో అనేక పరాభవాలు పొంది, మార్చి, సెప్టెంబర్, మార్చి, నామస్మరణలో చివరికి బి. ఏలో ప్రవేశించి క్రిందపడ్డా పైచెయ్యి వాదంటూ ఎం. ఏ. ప్రయివేటుగా పూర్తి చేశాడు.

అతనికి అప్పుడే ముప్పై సంవత్సరాలు నిండాయని అతని విద్యా సంబంధమైన కాగితాలు చెబుతాయి. కాదు ఇంకా ఎక్కువ వయసుండ వచ్చునని బట్టతల ఏర్పడ్డానికి దోహదం కలిగించే అతని తెల్లవెంట్రుకలు, నల్లనైన అతని భారీ శరీరంలోని అలసట తెల్పుతాయి.

అతనికి చిన్నతనంనుండి ఒక కోరిక వుంది. అది తను పెద్ద పెద్ద చదువులు చదవాలని. పెద్ద ఉద్యోగం చేయాలని. తరువాత పదహారు సంవత్సరాల పసిడి బొమ్మని వివాహమాడి సినిమాల్లో లాగా హాయిగా కాలక్షేపం చేయాలని.

అతని మొదటికోరికని కష్టపడి సఫలీకృతం చేసుకున్నాడు. ఉద్యోగం చేయ నవసరంలేని ఆస్తి అతనికుంది. ఇక పదహారు సంవత్సరాల పిల్లని చేసుకోవాలన్న కోరిక ఎండమావిలా మిగిలింది. అతను చదివిన పుస్తకాల్లోనూ, చూసిన సినిమాల్లోనూ, 'పదహారు సంవత్సరాల' ప్రాముఖ్యతను అతను గమనించాడు. అందుకే ఆరాటం. ఆ అందాన్ని ఆనందాన్ని అందుకోవాలని. కాని ఆ అవకాశం అతనికి అందుబాటులోకి రాలేదు.

లక్ష్మీపతిగారికి కొడుక్కి పెళ్లి కాదేమో అని భయం. యిటువంటి పరిస్థితులలో ఎలా వ్యవహరించాలో ఆయన ఆలోచిస్తున్నారు. పెద్దల సూక్తులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

* * *

'చూడండి వెయ్యి అబద్ధాలాడి ఒక పెండ్లి చేయమన్నారు. మీరిలా చూస్తూ కూర్చుంటే మీ అమ్మాయికి పెండ్లి కాదు—' సుబ్బరామయ్య ఆగాడు, అనంతరామయ్యగారు ఆలోచిస్తున్నారు.

'అబ్బాయి ఎం. ఏ. వరకు చదువుకున్నాడు. ఉద్యోగం చేయక పోయినా తినడానికి బోలెడంత ఆస్తివుంది — ఇక పోతే.. ఏదీ నస్యం కొంచం' అంటూ అనంతరామయ్యగారి దగ్గర తీసుకున్న నశ్యం ఒకపట్టు పెట్టాడు.

'అబ్బాయి వయసు ముప్పైసంవత్సరాలంటున్నారు కానీ, దాటింది. యిక మీ అమ్మాయి వయసు తెలుసుకదా?'

'అది నిజమే అనుకోండి' అంటూ సాలోచనంగా ఆగాడు అనంతరామయ్యగారు.

'అన్నింటికన్న ముఖ్యం పిల్ల. పిల్ల వాడికి నచ్చింది. మీ అమ్మాయికి అబ్బాయి నచ్చాడని చెబుతున్నారు—'

'అన్నీ బాగానే వున్నాయికాని, నేను చేసే మొదటి శుభకార్యం, ఎవరికి తెలీకుండా తిరుపతిలో జరగాలంటే నా మన స్సంగీకరించడంలేదు.'—ఆయన మాటలకి అడ్డువస్తూ అన్నాడు సుబ్బరామయ్య—

'చూడండి...పిల్లవాడు మంచివాడు. అమాయకుడు. మనం తిరుపతిలో వివాహం ఎందుకు సంకల్పించామో మీకు తెలుసు.'

'సరే చేస్తామనుకోండి. తరువాత... ఏమైనా పేచీలు వస్తాయేమో?' అని తన సందేహం వెలిబుచ్చాడు అనంతరామయ్య గారు.

'అసలు విషయం మీకు, నాకు, లక్ష్మీపతిగారికి తప్ప యింకెవరికి తెలియనీయము — పెండ్లి అయిన తరువాత చూస్తారుగా—నా తడాఖా—'

'ఆడపిల్ల తండ్రిని, నేను కొంచెం ఆలోచించుకోవలసి వుంది'

'దీంట్లో ఆలోచించవలసిన దేమీలేదు. అంతా నామీద వదేయండి. రాకుమారి నా కూతురనుకుని ఆ నరహరికి ఒక గుణపాఠం చెబుతాను—పదహారు సంవత్సరాల పిల్ల కావాలట! ముప్పైరెండు సంవత్సరాల కుర్రాడికి.'

'మీ రంతగా చెబుతున్నారు కాబట్టి ప్రస్తుత నా పరిస్థితుల దృష్ట్యా ఒప్పుకుంటున్నాను...మీ యిష్టం.'

'సరేయిక అసలు విషయంలోకి వద్దాం—' అంటూ ఒకసారి గొంతు సవరించుకున్నాడు సుబ్బరామయ్య.

* * *

'ఇక అసలు విషయం. పెండ్లి చాలా సింపుల్‌గా చేస్తున్నారు. కాబట్టి అవీ యివీ అన్నీ కలుపుకుని అయిదువేలు యిస్తామన్నాడు' అంటూ కాఫీగ్లాసు అందుకున్నాడు సుబ్బరామయ్య.

'అయిదువేలా?' అంటూ నిరుత్సాహ పడ్డారు లక్ష్మీపతిగారు.

'అవును మీ అబ్బాయి పిచ్చికోరిక మీకు తెలుసుకదా. ఎవరైనా 'చిన్నది' ప్రేమంటూ మోసంచేసి పెండ్లి చేసుకుంటే ఏం చేస్తారు?' అంటూ సవాల్ చేశాడు.

'ఈ పిచ్చిలో మీ అబ్బాయి వర్ణాంతర, మతాంతర వివాహం చేసుకుంటే మీరేం చేస్తారు?' మీ మర్యాదా, పరువు మంట గలుస్తాయి. కట్నంకూడా రాదు.'

లక్ష్మీపతిగారు ఆలోచిస్తున్నారు.

'నేను అన్ని కోణాలా ఆలోచించాను. ఈ సంబంధం మీకు అన్నివిధాల తగినది. మీ అబ్బాయి ఆరోగ్యంగా వుండాలంటే ఈ పెండ్లి జరిగితీరాలి' అంటూ కాఫీ త్రాగడం పూర్తిచేశాడు.

'అంతే నంటారా?'

'మీరు ఆలోచిస్తూ కూర్చుంటే నేను ముందుగా చెప్పిన ఏ ఆపదైనా జరగవచ్చును.' అంటూ కాఫీ త్రాగడం ముగించాడు సుబ్బరామయ్య.

'సరే మీ యిష్టం' అంటూ నీరసంగా నిట్టూర్చారు లక్ష్మీపతిగారు.

* * *

కట్నం ఆశించి ఆ వారిని పెండ్లి చేసుకుంటానన్న రాకుమారికి పదహారు సంవత్సరాలు నిండని పసిడిబొమ్మని పెండ్లి చేసుకుంటానని ప్రతిజ్ఞచేసిన నరహరికి గుట్టుగా తిరుపతిలో పెండ్లి చేయించారు సుబ్బరామయ్య యిందులో ఆయన స్వార్థం లేదు. వివాహాలు ఆ లోకంలోనే జరిగిపోతాయి. కేవలం మనం నిమిత్తమాత్రులం. ఇది కావాలనీ, అది కావాలనీ కోరుకున్నా మనకి లభించేది 'కర్మ' ననుసరించే మాత్రమే అని నిరూపించదలిచాడు సుబ్బరామయ్య.

*   *   *

బాలభాస్కరుని బంగారు కిరణాలు చురుక్కుమని గుచ్చుకోగానే ఉలిక్కిపడి లేచాడు నరహరి. గోడగడియారం ఎనిమిదిగంటలు కొట్టింది. బయట గాజుల గలగలలు. గుసగుసలు. సన్నగా నవ్వులు. ఎవరో అంటున్నారు

'ఏమిటే బావగారికి రాత్రి అసలు నిద్ర లేకుండా చేశావా?' మంచంమీద పడుకున్న నరహరి 'ప్స్' అనుకుంటూ లేచాడు. ఆ రాత్రి అతను ఎనాలోచితంగా, ఆలోచిస్తూ మంచంమీద పడుకున్నాడు. ఎప్పుడు నిద్రపట్టిందో అతనికి తెలియదు. గదితలుపులు తీయబోయిన నరహరి ఒకసారి భయంలో పడిపోయాడు. రాత్రి జరిగిన సంఘటనతో ఏడ్పులు, అల్లరి, గందరగోళంతో యిల్లు నిండిపోతుందని ఆశించాడు. వాళ్ళు అడిగే ప్రశ్నలకి జవాబులు సిద్ధంగా వుంచుకున్నాడు. కాని అతనాశించిన మార్పు ఆ యింటి వాతావరణంలో లేదు. కాలకృత్యాలు ముగించుకుని కాఫీ తాగాడు. సమయంకోసం ఎదురు చూస్తున్నాడు తన బాధని, ఆక్రోశని వెలిబుచ్చడానికి. కాని ఆ యింటిలో ఎవరిపనిలో వాళ్ళున్నారు,

స్నానానికి బాత్‌రూంకి వెళ్తున్న నరహరి నెత్తిమీద పిడుగు పడినట్లయింది. ఒకసారి బాధగా వెనక్కి చూశాడు.

'అవునే ఆ ముసలాడ్ని ఎవరు చేసుకుంటారే'

ఆ కంఠంలో ఆవేశం కళ్ళల్లో ఆధిక్యత పదహారు సంవత్సరాలు నిండని ఆ పసిడి బొమ్మ లేగులాటిరంగు పరికిణీ, వోణిలలో మెరిసిపోతున్నది,

'అదికాదే రుక్మిణి అతనికింకా ముప్పై సంవత్సరాలు నిండలేదుగా?'

కోపంగా బాత్‌రూం తలుపులు మూశాడు. మల్లెపందిరి నీడలో వాళ్ళ సంభాషణ అతనికి వినబడుతోంది.

అతని ఉద్రేకం, ఆవేశాల్ని పోసుకుంటున్న వేడినీళ్ళు మరింత రెచ్చగొడుతున్నాయి.

స్నానం ముగించి బట్టలు కట్టుకుని వరండాలోకి వచ్చాడు.

'ఇదిగో రంగనాథం నీకిది న్యాయం కాదు. రుక్మిణికి పదహారు నిండలేదు... మరి' ఆ పెద్దమనిషి ఆగాడు.

పేపరు చూస్తున్న నరహరి వాళ్ళ సంభాషణ ఆసక్తిగా వింటున్నాడు.

'అది కాదయ్యా...అతను రుక్మిణినితప్ప యింకెవరిని పెండ్లిచేసుకోనంటున్నాడు'

'ఎలా యిస్తామయ్యా...అతని వయసు మీకు తెలుసుకదా ... దాని మనసుకూడా మనం అర్థం చేసుకోవాలి.'

నరహరి ఆలోచిస్తున్నాడు. 'అతను తనకున్న కోరికే వాళ్ళకీ వుండవచ్చును. ఇరవై సంవత్సరాల యువకుడ్ని వారూ కోరుకోవచ్చును. తాను ఎంత మూర్ఖంగా ప్రవర్తించాడు. రాకుమారి. నిజంగా అన్నివిధాల రాకుమారి. రాత్రి జరిగిన సంఘటన్ని పెదవి దాటనీయలేదు. అంతటి అమాయకురాలిపట్ల తన కెందుకీ విముఖత! ఆమె సహనం ముందు తన దురుసుతనం ఎందుకూ పనికిరాకుండా పోయింది. తాను ఎంత ఆటవికుడిలా ప్రశ్నించినా, ఓర్పుతో సమాధాన మిచ్చింది. చదువులో సరస్వతి, లక్ష్మి రూపవతైన రాకుమారిని ఎంత చులకనగా చూశాను...'

'ఆ అమ్మాయితప్పు లేదు. మనోరమ యిప్పుడు కాకపోయినా యింకెప్పుడైనా పారిపోయేదే. వయసులో వున్న అమ్మాయిని డబ్బు కక్కుర్తితో తల్లిదండ్రులు రెండోపెండ్లి చేశారు.

బలహీనుడు, వృద్ధుడైన రెండోపెండ్లివాడు ఆమె ఆశల్ని త్రుంచేశాడు. అప్పుడేం చేస్తుంది?' ఆవేశంగా ప్రశ్నించారు రంగనాథంగారు.

నరహరి పేపరు చదవడంలేదు. అతనికి జ్ఞానోదయ మయినట్లయింది. రాకుమారిని కలుసుకుని క్షమాపణ చెప్పుకోవాలనుకున్నాడు.

గబగబా లోపలిగదిలోకి నడిచాడు నరహరి.

'అబ్బాయికి కాఫీకావాలేమో అమ్మాయిచేత పంపించండి' అంటున్నాడు సుబ్బరామయ్య వరండా స్తంభందగ్గర నించుని.

వెనక్కి తిరిగి చూశాడు నరహరి. ఆ గదితలుపులు మూసుకున్నాయి.

'కాఫీ తీసుకోండి. చల్లారి పోతున్నాయి' అన్న రాకుమారి కంఠం సౌమ్యంగా వినబడింది. ప్రేమతో ఆమె కళ్ళల్లోకి చూశాడు నరహరి. ●